క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మద్దిరాల : దిర్శనపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని చిన్ననెమిల గ్రామానికి మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ విద్యుత్‌లైన్‌కు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మేడే జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

తుంగతుర్తి : ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను వాడవాడలా ఘనంగా జరుపుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు కోరారు. సోమవారం మండలం కేంద్రంలోని వీఎన్ భవనంలో జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, నాగారం మండల కన్వీనర్ దేవరకొండ యాదగిరి, మండల కమిటీ సభ్యులు గడ్డం ఎల్లయ్య, జాజిగాల ముత్తయ్య, బోనాల వెంకన్న, సోమయ్య, యాదగిరి పాల్గొన్నారు.

నేడు భూభారతి చట్టంపై అవగాహన సదస్సు

మోతె : మోతె మండల కేంద్రంలోని స్వస్తిక్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సోమవారం తహసీల్దార్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు రైతులు, అధికారులు, ప్రజలు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పశు వైద్యశిబిరం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కాసర్లపహాడ్‌లో సోమవారం పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 100 పశువులకు టీకాలు వేశారు. రైతులు ముందస్తుగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని వైద్యసిబ్బంది సూచించారు. రోజుకో గ్రామంలో పశువైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ బి.అర్జున్, సిబ్బంది వి.యాకయ్య, రైతులు పాల్గొన్నారు.

వడదెబ్బ బారిన పడిన కూలీలను ఆదుకోవాలి

అర్వపల్లి : ఉపాధిహామీ పథకంలో పనులకు వెళ్లి వడదెబ్బ బారిన పడిన కూలీలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఉపాధిహామీ పథకం మేట్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ నర్సయ్య విజ్ఞప్తి చేశారు. సోమవారం అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక మంది కూలీలు వడదెబ్బ బారిన పడుతున్నారని చెప్పారు. గుండాల మండలం వస్తకొండూరులో ఉపాధి పనులకు వెళ్లి వడదెబ్బకు గురై మృతిచెందిన నిరుపేద కుటుంబీకురాలు మరియమ్మ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.

బిక్కేరు వాగులో ఇసుక తవ్వకాలకు హద్దులు ఏర్పాటు



వాగులో హద్దులు నిర్ణయిస్తున్న అధికారులు

నాగారం : పేరబోయినగూడెం రెవెన్యూ శివారులోని బిక్కేరు వాగులో మన ఇసుక – మన వాహనం పాలసీలో హద్దులు దాటి ఇసుకను తోడుతున్నారని ఆరోపణలు రావడంతో సోమవారం తహసీల్దార్ వి.బ్రహ్మయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ప్రకాశ్ ఆధ్వర్యంలో బిక్కేరు వాగులో సర్వే చేసి హద్దులు నిర్ణయించారు. హద్దులు దాటి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఇసుక రవాణాకు అనుమతి ఉందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయతో పాటు రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వివరాలు సేకరించాలి

మునగాల : హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై పశువుల సంచారంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, మండలంలోని గ్రామాల్లో పశువులు పెంచుతున్న వారి వివరాలను ఎమ్మార్పీఎస్ గ్రామశాఖ అధ్యక్షులు సేకరించాలని ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు గుడిపాటి కనకయ్య మాదిగ కోరారు. సోమవారం మునగాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జాతీయ రహదారి పక్కన ఉన్న గ్రామాల్లోని పశువులు రేయింబవళ్లు రోడ్డుపైకి వస్తుండడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. పశువుల వివరాలను సేకరించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

మట్టికొట్టుకుపోయి గూనలు తేలాయ్!

ప్రమాదకరంగా మారిన సూర్యాపేట పట్టణంలోని ఈదులవాగు వంతెన



ప్రమాదకరంగా ఉన్న ఈదుల వాగు వంతెన



మట్టి కొట్టుకుపోవడంతో అస్తవ్యస్తంగా ఉన్న గూనలు

- అధ్వానంగా ఉన్న రోడ్డుపై వెళ్లలేక ప్రజల ఇబ్బందులు
- మరమ్మతు చేయించాలని వేడుకోలు

సూర్యాపేట అర్బన్ : సూర్యాపేట పట్టణంలోని కొత్త ఎస్పీ ఆఫీస్ ఎదురుగా ఉన్న ఈదుల వాగు వంతెన వర్షాకాలంలో వచ్చిన వరదల కారణంగా కోతకు గురై గూనలు తేలి అస్తవ్యస్తంగా తయారైంది. ఈ వంతెన మీదుగా ప్రయాణించే మావిళ్లగడ్డ, సీతారాంపురం, చంద్రన్న కుంట, ఇందిరమ్మ ఫేస్ టు కాలనీకి చెందిన వారు, తాళ్లగడ్డ ప్రజలు వాగు దాటాలంటే కత్తిమీద సాములా తయారైంది. ముఖ్యంగా వర్షాకాలం వస్తే పైనుంచి వచ్చే వరదకు ఆ రోడ్డు మీదుగా వెళ్లటం అంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందేనని పలువురు తెలుపుతున్నారు.

గూనలు తేలి ప్రమాదకరంగా..

పట్టణంలోని ఈదుల వాగుకు పిల్లలమర్రి శివారు నుంచి తాళ్లగడ్డ ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంతం నుంచి వరద విపరీతంగా వస్తుంది. అయితే నాసిరకంగా మట్టి పోసి గూనలు వేయడంతో వర్షాకాలంలో వరదతోపాటు సమీపంలోని మురుగు కాలువ వల్ల వంతెన మొత్తం ముందు వెనుక మట్టి కొట్టుకుపోయి గూనలు తేలి అస్తవ్యస్తంగా తయారైంది. అలాగే పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో ఆ రోడ్డుపై వెళ్లే సీతారాంపురం, చంద్రన్నకుంట, మావిళ్లగడ్డ ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారు. అలాగే తాళ్లగడ్డలోని వ్యవసాయదారులు నిత్యం పనులకు ఈ బ్రిడ్జి వద్ద నుంచే వెళ్తుంటారు. కానీ బ్రిడ్జి వద్ద రోడ్డు కొట్టుకుపోయి ప్రమాదకరంగా ఉండడంతో ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. వ్యవసాయ పనులకోసం ఉపయోగించే ట్రాక్టర్‌లు పొలాల వద్దకు వెళ్లాలంటే చుట్టూ తిరిగి పోవాల్సివస్తోంది. అధికారులు స్పందించి వంతెనను, డ్రెయినేజీ కాలువలను బాగు చేయించి సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాలు, కాలనీలవాసులు కోరుతున్నారు.



కోతకు గురై తేలిన సైడ్ పిల్లర్లు

వంతెన నిర్మించాలి



వ్యవసాయ పనుల నిమిత్తం నిత్యం మావిళ్లగడ్డ నుంచి తాళ్లగడ్డ వెళ్తాను. కానీ బ్రిడ్జి కొట్టుకుపోయిన దగ్గర నుంచి ఈ రోడ్డు గుండా వెళ్లాలంటేనే ఇబ్బందిగా ఉంది. ట్రాక్టర్ తీసుకుపోవాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. అధికారులు తొందరగా ఈ వంతెనను బాగు చేసి వినియోగంలోకి తీసుకురావాలి.

– బొల్లం నాగరాజు, మావిళ్లగడ్డ

వరదలకు దెబ్బతిన్నది



ఈదుల వాగు వంతెన వరదలతో దెబ్బతి న్నది. మట్టి కొట్టుకుపోవడంతో గూనలు తెలాయి. గూనలు పైకి తేలి చిందరవందరగా అవ్వడంతో ఈ దారిలో వెళ్లడం కష్టంగా ఉంటుంది. మురుగు కాలువలు, బ్రిడ్జి కలిసిపోయాయి. అధికారులు స్పందించి రోడ్డు వేసి వంతెనను కాంక్రీటుతో పక్కాగా నిర్మించాలి.

– దేశబోయిన రాజు, సీతారాంపురం

బాల భవన్ శిక్షణ.. భవితకు భరోసా



మాట్లాడుతున్న వెన్న కవిత

సూర్యాపేట అర్బన్ : బాల భవన్‌లో అడ్మిషన్లు జోరుగా సాగుతున్నాయని, బాల భవన్ శిక్షణ.. భవితకు భరోసా అని పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు వెన్న కవిత అన్నారు. సోమవారం బాలభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక కళను నేర్చుకోవాలని, మన సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకోవాలని అన్నారు. లలిత కళల్లో శిక్షణ పొందిన వారికి సృజనాత్మకత మెరుగుపడుతుందని తెలిపారు. మెదడు చురుకుదనం పెరుగుతుందని అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాల్ భవన్‌లో శిక్షణ పొందిన వారికి నిరుద్యోగ సమస్యే ఉండదని తెలిపారు. బాల భవన్‌లో అందించే శిక్షణతో సొంతంగా ఉపాధి అవకాశాలు పొందవచ్చని అన్నారు. వేసవితోపాటు ఏడాది పొడవునా సాయంత్రం కూడా శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల భవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణారెడ్డి, సిబ్బంది దాసరి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్‌సీడ్ పద్ధతిపై రైతులకు అవగాహన



మాట్లాడుతున్న శాస్త్రవేత్త భీమ పవన్

ఆత్మకూర్(ఎస్) : వరి సాగులో రైతులు నేరుగా వరివిత్తే విధానం(డ్రమ్‌సీడ్)పై అవగాహన కలిగి ఉండాలని సీఎస్ఆర్ బాక్స్ సంస్థ శాస్త్రవేత్త భీమ పవన్ అన్నారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని రైతు ఉత్పత్తిదారుల సేవా కేంద్రంలో సోమవారం రైతులకు డ్రమ్‌సీడ్ పద్ధతిపై పీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. రైతులకు అధిక దిగుబడి, నీటి పొదుపు పట్ల మెళకువలు తెలిసి ఉండాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు డ్రమ్‌సీడ్ అందజేశారు. కార్యక్రమంలో పెద్ది సాయికుమార్, రేఖ బాలకృష్ణ, గరికపాటి హర్షదీప్, రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ సమనయ్య, మద్రు రవీందర్‌రా వు, క్రాంతి కుమార్, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే

- బృందాలుగా ఏర్పడి సర్వే చేస్తున్న అధికారులు
- జాజిరెడ్డిగూడెం మండలంలో కొత్తగా 265 ఇళ్లు మంజూరు



లోయపల్లిలో సర్వే చేస్తున్న ఎంపీడీఓ గోపి

అర్వపల్లి : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జాజిరెడ్డిగూడెం మండలవ్యాప్తంగా కొనసాగుతోంది. ఎంపీడీఓ టి.గోపి, గృహనిర్మాణ శాఖ డీఈ జబ్బార్ అహ్మద్, పీఆర్ ఏఈ కుమారస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నవీన్‌కుమార్, ఏఓ గణేష్‌లు ఐదు బృందాలుగా ఏర్పడి మండల వ్యాప్తంగా సర్వే చేస్తున్నారు. కాగా జాజిరెడ్డిగూడెం మండలానికి సంబంధించి ఇప్పటికే పైలెట్ గ్రామంగా ఎంపికైన ఉయ్యాలవాడకు గతంలో 110 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా పనులు మొదలయ్యాయి.

కొత్తగా 16 జీపీలకు 265 ఇళ్లు మంజూరు..

జాజిరెడ్డిగూడెం మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా ఉయ్యాలవాడకు ఇప్పటికే ఇళ్లు మంజూరై పనులు మొదలు కాగా మిగిలిన 16 గ్రామ పంచాయతీలకు 265 ఇళ్లు మంజూరయ్యాయి. అందులో అడివెంలకు 17, అర్వపల్లికి 24, బొల్లంపల్లికి 9, జాజిరెడ్డిగూడెంనకు 45, కాసర్లపహాడ్‌కు 21, కోడూరుకు 17, కోమటిపల్లికి 5, కొమ్మాలకు 23, కుంచమర్తికి 11, లోయపల్లికి 9, నాన్యతండాకు 4, పర్సాయపల్లికి 18, రామన్నగూడెంనకు 19, సూర్యనాయక్ తండాకు 9, తిమ్మాపురంనకు 28, వేల్పుచర్లకు 6 చొప్పున ఇళ్లు మంజూరయ్యాయి.

సర్వే కొనసాగుతోంది



జాజిరెడ్డిగూడెం మండలంలోని ఉయ్యాలవాడలో ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టు కింద ఇళ్లు మంజూరు కాగా మిగిలిన 16 గ్రామ పంచాయతీలకు కొత్తగా 265 ఇళ్లు మంజూరయ్యాయి. ఐదు బృందాలను ఏర్పాటుచేసి సర్వే చేస్తున్నాం. గ్రామాల వారీగా ఇందిరమ్మ కమిటీల సహకారంతో అర్హుల జాబితాను సిద్ధం చేస్తున్నాం. రెండు రోజుల్లో సర్వే పూర్తిచేసి అర్హుల జాబితాను జిల్లా అధికారులకు పంపించడం జరుగుతుంది.

– టి.గోపి, ఎంపీడీఓ

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి



తిరుమలగిరిలో బడి బాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



పెన్‌పహాడ్ : తంగెళ్లగూడెంలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



అర్వపల్లి : రామన్నగూడెంలో బడిబాట ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

తిరుమలగిరి : బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తిరుమలగిరి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కసిరెడ్డి అశోక్‌రెడ్డి కోరారు. సోమవారం తిరుమలగిరిలో జయశంకర్ బడి బాట కార్యక్రమం నిర్వహించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య, నాణ్యమైన భోజనం, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్.కవిత, ఎ.సత్యనారాయణరెడ్డి, వెంకటరామనర్సయ్య, బి.సోమ్మాబాయి, టి.గిరి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులకు సన్మానం..

ఇంటింటికీ బడిబాట కార్యక్రమంలో భాగంగా గతంలో తిరుమలగిరి పాఠశాలలో చదివి ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు ఆవుల శ్రీనిధి, రేపటి మనోజ్, సంతోష్, ఎల్లంల నవీన్, భూక్యా నిఖిల్, చింతకింది సాత్విక్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామెర శ్రీనివాసులు, ఉపాధ్యాయులు సోమయ్య, వెంకన్న, ఉపేంద్ర, సత్తిరెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తంగెళ్లగూడెం గ్రామంలో..

పెన్‌పహాడ్ : బడి ఈడు పిల్లలను సర్కారు బడిలోనే చేర్పించాలని హెచ్‌ఎం మేకల రాజశేఖర్ అన్నారు. సోమవారం తంగెళ్లగూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో చక్కటి విద్యా బోధన లభించే ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లల్ని చేర్పించాలని కోరుతూ ఇంటింటికీ తిరిగి గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు మల్లేపల్లి ధనలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ కళావతి, బాదె ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రామన్నగూడెంలో బడిబాట ప్రచారం

అర్వపల్లి : మండల పరిధిలోని రామన్నగూడెంలో సోమవారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటి ప్రచారం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపవద్దని, ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చిప్పలపెల్లి ధర్మయ్య, ఉపాధ్యాయులు నీరజ, వెంకన్న, వేమారెడ్డి, సుధారాణి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కర్రెగుట్ట ప్రాంతంలో ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి

అర్వపల్లి : ఆపరేషన్ కగార్ పేరుతో సాయుధ పోలీస్ బలగాలు చేస్తున్న కూంబింగ్, ఎదురు కాల్పులను తక్షణమే నిలిపి వేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బొడ్డు శంకర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. మావోయిస్టు పార్టీ శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం నరమేధాన్ని సృష్టిస్తోందని విమర్శించారు. కర్రెగుట్ట ప్రాంతంలోని సాయుధ బలగాలను వెంటనే వెనక్కి రప్పించాలని కోరారు. ఈ సమావేశంలో పోలెబోయిన మధుకర్, సురేష్, విజయ్, పగిడిమర్రి నాగయ్య, యాగానందం, కోమటి కృష్ణమూర్తి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'కల్యాణలక్ష్మి' సాయం అందేదెప్పుడో..

- ఏడాదిన్నరగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు
- ఆత్మకూరు మండలవ్యాప్తంగా 101 దరఖాస్తులు



ఆత్మకూర్ (ఎస్) : ఆడపిల్లల పెళ్లిళ్లు చేసిన తల్లిదండ్రులు గత ఏడాదిన్నరగా కల్యాణలక్ష్మి డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. దరఖాస్తు చేసి 18 నెలలకు పైగా అవుతున్నా నేటికీ డబ్బులు అందక పోవడంతో వారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికారులు సైతం తమకేమీ తెలియదు అంటూ సమాధానం చెబుతుండడంతో అసలు కల్యాణలక్ష్మి డబ్బులు వస్తాయా రావా అనే భయాందోళనలో తల్లిదండ్రులు ఉన్నారు. ఈ ఏడాదిన్నర కాలంలో మండల వ్యాప్తంగా దాదాపు 101 మంది జంటలకు పెళ్లిళ్లు కాగా ఈ పథకంలో లబ్ధిపొందేందుకు దరఖాస్తు చేసుకున్నారు.

అప్పుల పాలుకావొద్దని..

ఆడపిల్లల తల్లిదండ్రులకు ఆసరాగా ఉండేందుకు గత ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకంలో ఆడపిల్ల పెళ్లి చేసిన తల్లిదండ్రులు సంబంధిత ధ్రువపత్రాలతో తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఆడపిల్ల తల్లి పేరున లక్ష చెక్కు లభిస్తుంది. దీంతో ఆడపిల్లలతోపాటు వారి తల్లిదండ్రులు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కొంత అవకాశం ఉంటుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కొందరు లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోగా నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో సైతం దరఖాస్తులు వచ్చాయి. గత ప్రభుత్వం రూ.1లక్ష ఇవ్వగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వీటితోపాటు తులం బంగారం ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. కాగా 18 నెలలుగా కల్యాణలక్ష్మి చెక్కులు రాకపోవడంతో పాత పథకం అమలవుతుందా లేక కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తులం బంగారం వస్తుందా అని లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. వాస్తవానికి పెళ్లికి ముందే కల్యాణలక్ష్మి డబ్బులు ఇస్తామని చెప్పినప్పటికీ పెళ్లి అయ్యి 18 నెలలైనా డబ్బులు రాకపోవడంతో లబ్ధిదారులు అయోమయంలో ఉన్నారు.

దరఖాస్తు చేసి సంవత్సరం అవుతోంది



మా బిడ్డ పెళ్లి జరిగి సంవత్సరం దాటింది. పెళ్లయిన కొద్ది రోజులకే కాగితాలు అన్ని పూర్తి చేసి కార్యాలయంలో అప్పచెప్పాం. అధికారులు వచ్చి విచారణ చేసుకొని పోయారు. కానీ నేటికీ కల్యాణలక్ష్మి డబ్బులు రాలేదు. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం. అధికారులు వస్తాయి అంటున్నారు తప్ప డబ్బులు రావడం లేదు.

– ఎస్‌కే ఘని, ఆత్మకూరు

సోమయ్య మృతి సీపీఎంకు తీరని లోటు



సోమయ్య మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న మల్లు నాగార్జున రెడ్డి

ఆత్మకూర్(ఎస్) : కాట్ల సోమయ్య మృతి సీపీఎంకు, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు, ప్రజా కళాకారుడు కాట్ల సోమయ్య (65) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. కాగా సోమయ్య అంత్యక్రియల్లో పాల్గొన్న మల్లు నాగార్జున రెడ్డి ఆయన భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీపీఎంలో నిబద్ధత కలిగిన కార్యకర్త స్థాయి నుంచి డివిజన్ స్థాయి నాయకుడి వరకు కళాకారుడిగా ప్రజలలో చైతన్యం తీసుకువచ్చిన వ్యక్తి సోమయ్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు అబ్బగాని భిక్షం, ఎండీ జహీరుద్దీన్, దండ వెంకటరెడ్డి, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, యరగాని వెంకన్న, వివిధ పార్టీల నాయకులు కానుగు శ్రీను, అలుగువెల్లి వెంకట్ రెడ్డి, అవిరె అప్పయ్య, కటారి శ్రీను, బండారు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

భూమి ఉన్న ప్రతి రైతుకూ 'భూధార్'

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

చిలుకూరు : భూమి ఉన్న ప్రతి రైతుకూ భూ భారతి చట్టంలో భూధార్ కార్డు ఇవ్వనున్నట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. సోమవారం చిలుకూరులో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రెవెన్యూ రికార్డుల నిర్వహణకు త్వరలో ప్రతి గ్రామానికి ఒక అధికారిని ప్రభుత్వం నియమిస్తుందని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న రైతుల భూ సమస్యలు భూభారతి చట్టం ద్వారా పూర్తి స్థాయిలో పరిష్కారం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి వచ్చినవారు గ్రామాలకు వెళ్లి ప్రతి ఒక్కరికీ ఈ చట్టంపై అవగాహన కల్పించాలని, భూ సమస్యలు పరిష్కారం అయ్యేలా చూసుకోవాలని కోరారు. త్వరలో జిల్లాలో ఒక మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, భూ భారతి చట్టాన్ని పూర్తి స్థాయిలో ప్రణాళిక ప్రకారం అమలు చేస్తామని అన్నారు. ఆ తర్వాత క్రమంగా అన్ని మండలాలు, గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పెట్టి ఈ చట్టాన్ని అమలు చేస్తామని తెలియజేశారు. ఈ సదస్సులో ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీఓ గిరిబాబు, ఎంపీఓ ముక్కపాటి నరసింహారావు, డీటీ కరుణ శ్రీ, ఏఓ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ పుష్పలత, ఆర్ఐలు మంత్రిప్రగడ సీతరామచందర్‌రావు, శ్వేత, చిలుకూరు, నారాయణపురం ప్యాక్స్ చైర్మన్లు కొండా సైదులు, అలసకాని జనార్దన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో మద్యం విక్రయాల జోరు!

- విచ్చలవిడిగా బెల్టు షాపులు
- అందుబాటులో 24 గంటలు మద్యం
- తనిఖీలు చేపట్టి అడ్డుకట్ట వేయాలని కోరుతున్న ప్రజలు

తిరుమలగిరి : పచ్చని పల్లెలు మద్యం విక్రయాలకు నిలయాలుగా మారుతున్నాయి. రోజంతా కష్ట పడి పని చేసే కూలీలు మద్యానికి బానిసై జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. ఫలితంగా కుటుంబాలు ఆర్థికంగా చితికిపోవడమే కాకుండా యువకులు నేరాలకు పాల్పడే అవకాశం ఉంది. తుంగతుర్తి నియోజకవర్గంలో వందల సంఖ్యలో మద్యం గొలుసు దుకాణాలు నడుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. గ్రామాలలో మద్యం 24 గంటల పాటు అందుబాటులో ఉంటుందని మందు బాబులే చెబుతున్నారు. అయితే పట్టించుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యం చేస్తుండటంతో గ్రామాల్లో మద్యం విక్రయాలు ఆగడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

రాత్రింబవళ్లు..

నియోజకవర్గంలోని ఆయా గ్రామాలలో రాత్రి, పగలు అనే తేడా లేకుండా బెల్టు షాపుల్లో మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. మద్యానికి అలవాటు పడిన వారు ధరను పరిగణనలోకి తీసుకోకుండా ఎంతైనా వెచ్చించి కొనుగోలు చేసి తాగుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకొని గొలుసు దుకాణాల యజమానులు రాత్రింబవళ్లు విక్రయాలు చేస్తున్నారు. మద్యానికి రాత్రి 9 గంటల వరకు ఒక ధర, 9 నుంచి అర్ధరాత్రి వరకు అదనంగా ధరలు తీసుకుంటున్నట్లు సమాచారం. కొంత మంది యువకులు అర్ధరాత్రి వరకు మద్యాన్ని సేవిస్తూ రోడ్ల వెంట వచ్చిపోయే వారిని దుర్భాషలాడుతున్నారు. అలాగే కొన్ని సమయాల్లో ఘర్షణలకు దిగుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఇలానే జరిగితే మద్యానికి బానిసలై యువత పెడదారి పట్టడానికి అవకాశం ఉంది. అధికారులు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని రామన్నగూడెంలో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ గోపికి సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో నిరుపేదలు, వితంతువులకు తొలుత అవకాశం కల్పించాలని అన్నారు. గ్రామసభ ఏర్పాటు చేసి అర్హులను ఎంపిక చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, గ్రామకార్యదర్శి జె.కృష్ణయ్య, మచ్చ నర్సయ్య, సంపతి వెంకన్న, వజ్జె సైదయ్య, సాయికుమార్, శిగ వెంకన్న, ఎన్. అబ్బులు పాల్గొన్నారు.

ఘనంగా సొడమ్మ జాతర



గంపలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

నూతనకల్ : మండల కేంద్రంలో సొడమ్మ జాతరను సోమవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి భేరీలు, డప్పు చప్పుళ్ల మధ్య బోనాలను సమర్పించి తమ మొక్కలను చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో నూతనకల్, చిల్పకుంట్ల గ్రామాలకు చెందిన కుల పెద్దలు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

పెన్‌పహాడ్ : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల వైద్యాధికారి అనంతుల వెంకన్న అన్నారు. సోమవారం లింగాల గ్రామంలో పశు గర్భస్థ వ్యాధి చికిత్స, గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు అలీ, సైదులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చెన్నకేశ్వాపురం సీఎస్‌సీ నిర్వాహకుడు మేకల నాగరాజు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని తపాలా శాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో చెన్నకేశ్వాపురం గ్రామానికి చెందిన శివరాత్రి రమేష్‌కు విశ్వకర్మ పథకానికి సంబంధించిన టూల్ కిట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో తపాలాశాఖ సిబ్బంది హైమద్, కావ్యశ్రీ, రాందాస్, వీరస్వామి పాల్గొన్నారు.